

పురస్కార్-2026కు దరఖాస్తులు చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సూచనలతో, కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశాల మేరకు సుభాష్ చంద్రబోస్ ఆప్దద ప్రబంధన్ పురస్కార్-2026 కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అగ్నిమాపక అధికారి ధర్మారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 సంవత్సరానికి సంబంధించిన ఈ పురస్కారం కోసం ఆన్‌లైన్‌లో https://awards.gov.in అనే పోర్టల్ ద్వారా సెప్టెంబర్ 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చుని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం విపత్తు నిర్వహణ రంగంలో అద్భుతమైన సేవలందించిన వారికి, ఇన్‌స్టిట్యూషన్స్‌కు, ఇన్స్టిట్యూషన్స్‌కు "సుభాష్ చంద్రబోస్ ఆప్దద ప్రబంధన్ పురస్కారాన్ని అందజేస్తోందని తెలిపారు. పూర్తి వివరాలు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్ https://awards.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

'గోకులం' బిల్లుల కోసం ఎదురుచూపు!

అవస్థల్లో లబ్ధిదారులు

అప్పులు తెచ్చి కట్టుకున్నామని ఆవేదన



ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద నిర్మించిన గోకులం షెడ్లకు బిల్లులు మంజూరు కాకపోవడంతో రైతులు (లబ్ధిదారులు) ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వం గోకులానికి మంగలం పాడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్ద ఎత్తున గోకులం షెడ్లకు శ్రీకారం చుట్టారు. పాడి రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. పైగా రైతులకు గోకులం, గొర్రెల షెడ్లను మంజూరు చేసింది. దీంతో రైతులు నిర్మాణానికి పెద్ద ఎత్తున ముందుకొచ్చారు. రైతులు తమ వంతుగా పది శాతం సొమ్ము చెల్లిస్తే మిగిలిన యూనిట్ మొత్తాన్ని ప్రభుత్వం రాయితీపై నిర్మిస్తుంది. మొదట్లో షెడ్లు నిర్మించిన వెంటనే బిల్లులు మంజూరు చేసి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేశారు. నాలుగు నెలల నుంచి చెల్లింపులు లేక ఇబ్బంది పడుతున్నారు. త్వరగా కట్టండి అన్ని బిల్లులు ఒకేసారి పడతాయని సంబంధిత అధికారులు చెప్పడంతో లబ్ధిదారులు డబ్బులొస్తాయనే ఉద్దేశంతో అప్పులు తీసుకొచ్చి మరీ షెడ్లు నిర్మించారు. ఇప్పుడు బిల్లుల కోసం రోజూ ఎపిఒలు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

వైఎస్ఆర్ జిల్లాలో కడప, మైదుకూరు, పులివెందుల, కమలాపురం, బద్వేలు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజక వర్గాలకు మొత్తం 768 గోకులం షెడ్లకు రైతులకు అవకాశం కల్పించారు. అందులో 627 పూర్తి కాగా, 141 షెడ్లు కొన్ని బేష్ మట్టం స్థాయిలో, కొన్ని, భూమి లెవెల్, కొన్ని రూఫ్ లెవెల్‌లో అసంపూర్తిగా ఉన్నాయి. దాదాపు ఇప్పటి వరకు పూర్తి అయిన వాటికి రూ. 10 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. జమ్మలమడుగు మండలానికి 19 మంజూరు కాగా, అందులో 16 పూర్తి కాగా, 3 భేష్ మట్టం స్థాయిలో, మైలవరం మండలానికి 21 మంజూరుకాగా 15 పూర్తయ్యాయి. 6 వివిధ స్థాయిల్లో ఉన్నారు. కొండాపురం మండలానికి 24 మంజూరుకాగా, 21 పూర్తి అయ్యాయి. 3 అసంపూర్తిగా ఉన్నాయి. ముద్దనూరు మండలంలో 17 మంజూరుకాగా 14 పూర్తికావచ్చాయి, 3 అసంపూర్తిగా ఉన్నాయి. పెద్దమోడియం మండలానికి 21 మంజూరైతే 14 పూర్తయ్యాయి, ఏడు అసంపూర్తిగా ఉన్నాయి. ఎర్రగుంట్ల మండలానికి 14 మంజూరుకాగా 12 పూర్తి చేశారు. రెండు అంసపూర్తిగా ఉన్నాయి. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో కలిపి అసంపూర్తిగా ఉన్నవి 141 ఉన్నాయి. ముందు కట్టుకున్న వారికే బిల్లులు రాలేదు ఇక తమకు ఎప్పుడు వస్తాయనే ఆందోళనలో రైతులు ఉన్నారు. ఏదిఏమైనా సంబంధిత నియోజక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, త్వరగా కట్టండి బిల్లులు వస్తాయని చెప్పిన ఎపిఒలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి బిల్లులు ఇప్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. లేకపోతే తెచ్చుకున్న వడ్డీలకే మొత్తం అమౌంట్ పోతుందని ఇక అసలు ఎలా తీర్చాలని ఆవేదన చెందుతున్నారు.



పూర్తయిన గోకులం షెడ్

మూడు రోజుల్లో ఇస్తామన్నారు

త్వరగా కట్టండి మూడురోజుల్లో బిల్లులు త్వరగా పడతాయి అని సంబందిత అధికారి చెప్పడం వల్ల రూ.5 వడ్డీకి తెచ్చి నాలుగు గేదెలకు గోకులం షెడ్డు నిర్మించాం. పునాది నుంచి పూర్తి నిర్మాణం వరకు రూ 2.04 లక్షలు అయింది. బిల్లు మాత్రం రూ. 1.57 లక్షలు అని చెప్పారు. ఇంతవరకు ఇవ్వలేదు. కట్టి నాలుగు నెలలు పూర్తయింది. తెచ్చిన చోట డబ్బులు తిరిగి ఇవ్వమని ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం త్వరగా బిల్లులు మంజూరు చేస్తే కొంతవరకు మానం కాపాడుకుంటాం.

- రసూల్ నాయక్, బి.ఆర్.కొట్టాల

బిల్లులు రాక అవస్థలు పడుతున్నాం

త్వరగా కట్టండి మొత్తం బిల్లులు ఒకే సారి పెడతామని అధికారులు చెప్పడంతో మా వద్ద లేకపోయినా బయట వడ్డీలకు తెచ్చి కట్టుకున్నాం. ఇప్పుడు నాలుగు నెలలు గడిచినా బిల్లులు రాలేదు. అప్పులు ఇచ్చినవారు అడుగుతున్నారు. త్వరగా బిల్లులు చెల్లించాలి.

- పి.సాలమ్మ, లబ్ధిదారులు, పి.బొమ్మేపల్లి.

పూర్తయిన వాటికి బిల్లు పెట్టాం

జమ్మలమడుగు మండలానికి సంబంధించి పూర్తయిన గోకులం షెడ్లకు మా కార్యాలయం నుంచి మొత్తం బిల్లులను పెట్టి ఉన్నతస్థాయి అధికారులకు పంపాం. ప్రభుత్వం అమౌంట్ విడుదల చేస్తే బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో పడతాయి.

- పద్మరాణా, ఎపిఒ, జమ్మలమడుగు.

'ఉపాధి'లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - వేంపల్లె

జాతీయ ఉపాధి హామీ చట్టం పనుల్లో అవకతవకలకు పాల్పడితే సిబ్బంది, అధికారులపై చర్యలు తప్పవని జిల్లా శ్రీధర్ చెరుకూరి అన్నారు. జిల్లాలో జరుగుతున్న ఉపాధి పనుల్లో అవినీతి జరుగుతున్నదని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఇటీవల కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వేంపల్లె పంచాయతీ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీలో సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. అలాగే కూలీలతో పనులు, సౌకర్యాలు, బిల్లులు చెల్లింపుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ చట్టం కింద ఉద్యానవన పంటలను సాగు చేసిన నిమ్మ, చీనీ పంటలను కూడా పరిశీలించి రైతుల ద్వారా బిల్లులు చెల్లింపులు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలు డికెటి భూములను సాగు చేసుకొంటుంటే అలాంటి వారికి పట్టాలు ఇస్తామని కలెక్టర్ చెప్పారు. అక్కడ పని చేస్తున్న ఉపాధి మహిళా కూలీ తాను డికెటి భూమిని సాగు చేసుకొంటున్నానని, ఇంకా పట్టా ఇవ్వలేదని చెప్పడంతో వెంటనే కలెక్టర్ స్పందించి ఆర్‌డిఒను పిలిచి మహిళా కూలీకి పట్టాను ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో కూలీలకు మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో జాగ్రత్తలు తీసుకొని పనులు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీలు చేస్తామని చెప్పారు. ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. జాబ్ కార్డులు ఉన్న వారందరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధి కింద వంద శాతం నిధులు మంజూరు చేస్తారని చెప్పారు. కూలీలు డబ్బులను వృధా చేసుకోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చదివించుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత పుస్తకాలతో పాటు యూనిఫారం, మధ్యాహ్నం భోజనం పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. నాణ్యత గల విద్యను కూడ అందిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ వెంట పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య, తహశీల్దార్ హరినాథ్ రెడ్డి, ఎంపిడిఒ కుళాయమ్మ, ఉపాధి ఎపిఒ పార్వతి, ఉపాధి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



ట్రిపుల్ఐటిని పరిశీలిస్తున్న కలెక్టర్

నాణ్యమైన విద్యను అందించండి

ఆర్‌జెయుకెటి పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో చదివే గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. శుక్రవారం ట్రిపుల్ ఐటిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రిపుల్ ఐటిలోని ఆయా పరిసర ప్రాంతాలను పరిశీలించారు. డైరెక్టర్ కుమార స్వామి గుప్తా పూలబూకేతో కలెక్టర్ ఘన స్వాగతం పలికారు. అనంతరం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తాతో కలిసి ఆయా శాఖల అధికారులతో అడ్మినిస్ట్రేషన్ పై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమావేశం అయ్యారు. ట్రిపుల్ ఐటటికళాశాల ఎన్ని ఎకరాల్లో ఉంది, ఎన్ని భవనాలు, ప్యాకల్టీ, సిబ్బంది ఎంత మంది ఉన్నారనే వాటిపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. పదోతరగతిలో ప్రతిభ కలిగిన గ్రామీణ విద్యార్థులకు ట్రిపుల్ ఐటిలో చోటు కల్పిస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి డైరెక్టర్ తెచ్చారు.

ఆలయ పునః నిర్మాణ పనులు పూర్తి చేయాలి

చక్రాయపేట : రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి వీరాంజనేయ స్వామివారి దేవస్థానం ఆలయపునఃనిర్మాణపు పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆలయ అధికారులు కమిటీ సభ్యులు, కాంట్రాక్టులను ఆదేశించారు. శుక్రవారం ఆలయ సంప్రదాయం ప్రకారం కలెక్టర్‌ను ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామి, దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనంతర్వాత తీర్థ ప్రసాదాలు అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. స్వామివారి నూతన ఆలయ పునఃనిర్మాణపు అభివృద్ధి పనులను పరిశీలించి, ఇంకా పూర్తి కావాల్సిన పనులను త్వరిత గతిన పూర్తి చేసి ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎండోమెంట్ అధికారి జి.మల్లికార్జున ప్రసాద్, ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మెన్ కల్లూరి వెంకట స్వామి, పాలక మండలి సభ్యులు, వేంపల్లి మండల తహశీల్దారు వై. హరినాథ్ రెడ్డి, చక్రాయపేట, వేంపల్లి జడ్‌పిటిసిలు టి.శివ ప్రసాద్ రెడ్డి, ఎం. రవికుమార్ రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మా పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తాం

మున్సిపల్ యూనియన్ నాయకుల చర్చల్లో కమిషనర్ హామీ

ప్రజాశక్తి - కడప అర్బన్

తమ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన మున్సిపల్ యూనియన్ నాయకులతో తమ కార్యాలయ సమావేశ మందిరలో చర్చించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కమిషనర్ దృష్టికి పలు సమస్యలు తెలియజేశారు. ప్రధానంగా 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు ఎలాంటి బెనిఫిట్స్ లేకుండా తొలగించడం అన్యాయమని, అడిషనల్ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం, రెగ్యులర్ కార్మికులకు ప్రత్యేక క్వార్టర్స్ ఇవ్వాలని కోరారు. కార్మికులకు క్వార్టర్స్ కావాలంటే ఏడెకరాల స్థలం అవసరమని అంత స్థలం లేదని కమిషనర్ వారికి చెప్పారు. యూనియన్ నాయకులు తమ దృష్టిలో ఉన్న స్థలం విషయం కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ అనుమతితీసుకుని చేద్దామని ఆయన చెప్పారు. మహిళ కార్మికుల సమస్యలు, రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాల విషయం మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రెండు సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. రెగ్యులర్ కార్మికులకు సంబంధించి పెట్టిన 13 డిమాండ్లలో ప్రధానమైన నాలుగు డిమాండ్లను అంగీకరించారు. సబ్బులు, నూనెలు, బట్టలు, చెప్పులు, కుట్టు కూలీలు, రెగ్యులర్ కార్మికులకు కాకి బట్టలు, చీరలు ఒక నెల లోపల ఇవ్వాలని అధికారులకు కమిషనర్ సూచించారు. ఇంజినీరింగ్ సెక్షన్ డ్రైవర్స్ 9 మంది జీవో నంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని అడగ్గా కమిషనర్ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి పి హెచ్ డ్రైవర్ తో సమానంగా పనిచేస్తున్నారని వారికి కూడా యూనియన్ వారు రూ. 24,500 అడుగుతున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లినట్లు పేర్కొన్నారు. పాత మున్సిపల్ కార్యాలయం, డంపింగ్ యార్డు వద్ద వాటర్ సర్వీస్ పాయింట్ ఏర్పాటు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అడిషనల్ కార్మికులకు ఇస్తున్నటువంటి వేతనం రూ.12 వేలు సరిపోవడంలేదని వేతనాలు పెంచాలని అడగ్గా కమిషనర్ ఇప్పటికే మీరు అనేకమార్లు ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చారని, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత తొందరగా దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కడప కార్పొరేషన్ పరిధిలో ఉన్న పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సినటివి చేస్తుందని తెలిపారు. కాబట్టి అందరికి కార్మిక సంఘం సహకరించాలని కోరారు. సమావేశంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్, నగర అధ్యక్షులు సుంకర రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుపాటి శ్రీరాములు, సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్, డ్రైవర్ల కమిటీ కార్యదర్శి సుంకరి కిరణ్, అధ్యక్షుడు వడ్లపల్లి శ్రీధర్ బాబు,ధరణి, లక్ష్మి, సుజాత అమరావతి, ఉమా దేవి, సువర్ణ, రోడ్డ ఆదాం, తొండల మస్తాన్, గార్లపాటి శివ, నాగరాజ్, ఆర్ శీను, ఆసిబాబు, పెంచలయ్య,హరి, రాజు, కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ యూనియన్ నాయకులతో చర్చిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

నియోజకవర్గాల్లో మినీ మహానాడు

29న బహిరంగ సభ

టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

మహానాడు ముందు నిర్వహించే మినీ మహానాడు ఈనెల 19, 20, 21వ తేదీలలో 10 నియోజకవర్గాల్లో ఉంటాయని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ద్వారకా నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 43 సంవత్సరాల తర్వాత కడపలో మహానాడు పండుగ నిర్వహించుకుంటున్నామని తెలిపారు. 27, 28, 29న కడపలో మహానాడు ఉంటుందని పేర్కొన్నారు. 29న బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. ఉమ్మడి జిల్లాకు దగ్గరగా ఉన్న నెల్లూరు, జిల్లాకు ఒంగోలు కలుపుకుని అధిక సంఖ్యలో ప్రజలు బహిరంగ సభలో పాల్గొనేలా నాయకులు కృషి చేయాలని తెలిపారు. మినీ మహానాడులో జన సమీకరణ పై చర్చిస్తావని పేర్కొన్నారు. 27, 28న ప్రతినిధుల సమావేశం ఉంటుందని, 22 వేల మంది ప్రతినిధులు హాజరు కావచ్చని తెలిపారు. ఈనెల 18న బహిరంగ సభ ప్రాంతంలో సాయంత్రం 4 గంటలకు సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వసతి సౌకర్యాల కోసం ఫంక్షన్ హాల్స్, పాఠశాలలు, కళాశాలలు, కళ్యాణ మండపాలు, లాడ్జిలు తీసుకున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పార్కింగ్ స్థలాలు ఎంపిక చేశామన్నారు. మహానాడు గతం కన్నా భిన్నంగా చరిత్రలో నిలిచిపోయేలా కడపలో నిర్వహిస్తామని చెప్పారు. 6 కమిటీలను వేశామని, వారు పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. మహానాడు లేఅవుట్ ఇప్పటికే పూర్తయిందని తెలిపారు. మహానాడు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మేయర్ పదవి 14 రోజుల తర్వాత అయినా పోవడం ఖాయమని చెప్పారు. తప్పు చేసిన వారు తప్పించుకోలేని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



చింతకొమ్మదిన్నె : మ్యాప్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

మహానాడు ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మహానాడు కార్యక్రమాన్ని జిల్లాలోని కమలాపురం నియోజకవర్గం, చింతకొమ్మదిన్నె మండలంలోని చెర్లోపల్లి, పబ్బాపురం గ్రామాల్లో నిర్వహిచనున్నారు. ఇదుకు సంబంధిచిన ఏర్పాట్లును శుక్రవారం టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా ఉమ్మడి కడప జిల్లాలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా కని, విని ఎరుగని రీతిలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు, మహానాడు 125 ఎకరాల సువిశాలమైన ప్రాంగణంతోపాటు, పార్కింగ్ కోసం 300 ఎకరాలకు పైగా సిద్ధం చేసినట్లు తెలిపారు. అనంతరం సభా ప్రాంగణానికి విద్యుత్ ఏర్పాట్లపై డిఇ, ఎడిఇ, ఎఇలతో చర్చించారు. ,విద్యుత్ పనులను వెంటనే వేగవంతం చేసి పనులు పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు. వారి వెంట స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సూర్యనారాయణ

వ్యక్తిగత విమర్శలు వద్దు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాజకీయ నాయకులుగా ఉన్న మనం వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని 29వ డివిజన్ కార్పొరేటర్లు సుబ్బారెడ్డి, సూర్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపిని వీడిన తమపై ఆ పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఎవరు తల్లిపాలు తాగి రొమ్ములు గుద్దారో ప్రజలకు తెలుసని చెప్పారు. పది సెంట్ల స్థలం ఆక్రమించారో చూపిస్తే అందులో తొమ్మిది సెంట్లు వైసిపి నాయకుడు జయచంద్రారెడ్డికి రాసిస్తారని తెలిపారు. అభివృద్ధిపై చర్చకు సిద్ధమన్నారు.

డిప్లొమా కోర్సు ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కడప : ఎస్‌పికెఎం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో 2025-2026 విద్యా సంవత్సరానికి హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్ టెక్నాలజీలో 1, 3 సంవత్సరాల డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ప్రగడ కోటయ్య, వెంకటగిరి ఒఎస్‌డి ఎస్.గిరిధర్ రావు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వెంకటగిరిలోని ఎస్‌పికెఎం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో 53 సీట్లకు, తమిళనాడులోని సేలం లో12 సీట్లకు, కర్నాటకలోని గడగ్‌లో 4 సీట్లకు 3 మూడేళ్ల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజి డిప్లొమ కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. పదో తరగతి లేదా తత్సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై జులై 1 నాటికి 15 నుంచి 23 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 9399936872, 9866169908, 9010243054 సంప్రదించాలని తెలిపారు.

మేయర్ గురించి మాట్లాడే అర్హత లేదు

- వైసిపి నాయకులు జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి - కడప

వైసిపి తరపున కార్పొరేటర్లుగా గెలిచి, లక్షలాది రూపాయలు అక్రమంగా సంపాదించి, విలువలు సంప్రదాయాలకు పాతర వేసి స్వలాభం కోసం టిడిపిలో చేరి మేయర్ సురేష్ బాబుపై మాట్లాడే స్థాయి మీకుందా అంటూ టిడిపి కార్పొరేటర్లను వైసిపి నాయకులు ప్రశ్నించారు. వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు, కార్పొరేటర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మొదట నగరపాలక సంస్థ అధికారుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్ధిని కన్స్ట్రక్షన్ పేరుతో మేజరైన మేయర్ సురేష్ బాబు కుమారుడు నిర్మాణ సంస్థను ప్రారంభిస్తే, ఇందులో ఆయనకు ఏమి సంబంధం అన్నారు. నిర్మాణ సంస్థను ప్రారంభించేటప్పుడు మున్సిపల్ అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. పైగా మేయర్ అవినీతికి పాల్పడ్డాడని గ్లోబల్ ప్రచారం చేయడం తగదన్నారు. కడప నగర అభివృద్ధికి సురేష్ బాబు శక్తివంచన లేకుండా కృషి చేశారన్నారు. కేవలం ఎమ్మెల్యేకు కుర్చీ వేయలేదని కోపంతో కక్షగట్టి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని వివరించారు. సమావేశంలో కార్పొరేటర్లు షఫీ, బాలస్వామి రెడ్డి, వీరారెడ్డి, రామలక్ష్మణ్ రెడ్డి, నాయకులు జయచంద్రా రెడ్డి, శ్రీరంజన్ రెడ్డి, మోతుకూరు సుబ్బరాయుడు, వెలిగండ్ల లక్ష్మయ్య,ఐస్ క్రీమ్ రవి, మల్లికార్జున కిరణ్, దాసరి శివ వినోద్, త్యాగరాజు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ లావణ్య



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో విద్యార్థులు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

తాడిగొట్ల గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం 'స్వచ్ఛతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ లావణ్య మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు దరి చేరవని పేర్కొన్నారు. గ్రామస్తులు వ్యక్తిగత శుభ్రతతో పాటుగా మన చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ప్లాస్టిక్ వ్యర్థాలను గ్రామానికి దూరంగా పారవేయాలని, పార్థినియం మొక్కల వల్ల ఊపిరితిత్తుల సమ స్యలు వస్తాయి తెలిపారు. అందువల్ల వాటిని తీసివేయాలి సూచించారు. అనంతరం కీటక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ పాండురంగ మాట్లాడుతూ దోమలు, ఈగలు, పక్షులు, జంతువుల వల్ల రోగాలు త్వరగా మనుషులకు వ్యాపిస్తాయని చెప్పారు. నిలువ ఉన్న నీటి గుంటలలో, అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలలో వాటి సంతానాన్ని వ్యాప్తి చేయడం వల్ల ప్రజలకు రోగాలు వ్యాపిస్తాయని చెప్పారు. చుట్టూ పక్కల ప్రాంతాలలో మనమే శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు, అనంతరం గ్రామంలో ప్రజలు గుమిగుడే ప్రాంతాలు ప్రభుత్వ భవనాలు, దేవాలయాలు, వీధులలో చెత్తను ఏరి, పార్థినియం మొక్కలను పెరికివేసి, విద్యార్థులతో కలిసి గ్రామాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

శ్మశానవాటిక అభివృద్ధి పనులు పరిశీలన


ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అన్నవరం ఎస్‌సి కాలనీలో శ్మశాన వాటిక అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్నికల హామీలో భాగంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నియోజకవర్గ పరిధిలో ప్రతి మండలంలో ఐదు శ్మశాన వాటికలను పైలెట్ ప్రాజెక్టు కింద అభివృద్ధిపరిచేందుకు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా అన్నవరం ఎస్‌సి కాలనీలో ఉన్న శ్మశాన వాటిలకను అభివృద్ధిపరిచేందుకు చర్యలు ప్రారంభించారు. శుక్రవారం గ్రామ టిడిపి నాయకులు, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ నంద్యాల లోకేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో జెసిబితో కంపచెట్ల తొలగింపును చేపట్టారు. శ్మశాన వాటిక స్థలానికి కొలతలు వేయించి త్వరలో ప్రహరీని ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు.

పిహెచ్‌సిలో అరుదైన చికిత్స

- ఐదు కిలోల కణతి తొలగింపు

ప్రజాశక్తి-చాపాడు(మైదుకూరు)



మహిళ కడుపులో నుంచి తొలగించిన కణతి

మైదుకూరులోని పిహెచ్‌సిలో వైద్య బృందం అరుదైన శస్త్రచికిత్సను చేశారు. శుక్రవారం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ భూమిరెడ్డి చంద్రశేఖర్ మాట్లాడుతూ 44 ఏళ్ల వయసుగల మహిళ కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరారని చెప్పారు. వైద్య పరీక్షల అనంతరం ఆమె కడుపులో 5 కిలోలకు పైగా బరువున్న భారీ కణితి గర్భసంచిలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. తమ వైద్య బృందం అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో శస్త్రచికిత్స చేపట్టిందన్నారు. ప్రసూతి, స్త్రీ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ కె.శ్రీ లలిత నేతృత్వంలో, డాక్టర్ వీరనాథ్‌రెడ్డి, ఇతర వైద్య సిబ్బంది కణి తిని విజయవంతంగా తొలగించారన్నారు. ఈ శస్త్రచికిత్స అనంతరం రోగిని స్థిరంగా కాపాడగలిగినందుకు వైద్య బృందం సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రోగి పరిస్థితి నిలకడగా ఉందని, త్వరగా కోలుకుంటారని వైద్యులు చెప్పారు.



పశువైద్య కళాశాలను సందర్శిస్తున్న కౌన్సిల్ సభ్యులు

పశువైద్య కళాశాలలో

వెటర్నరీ కౌన్సిల్ సభ్యుల పర్యటన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక పశువైద్యకళాశాలలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పరిశీలకులు డాక్టర్ విజయకుమార్, డాక్టర్ సాహత్పురే ఈనెల 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు సాధరణ తనిఖీలు నిర్వహించారు. కళాశాలలోని వివిధ విభాగాలను, పశుచికిత్సాలయం, పశుగణక్షేత్ర సముదాయాలు, విద్యార్థుల వసతి గృహాలు, క్రీడావిభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి తమ సంతృప్తిని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా భోధన, భోధనేతర సిబ్బందితో, విద్యార్థిని, విద్యార్థులతో సమావేశమై వారి అభిప్రాయలను స్వీకరించారు. వారి వెంట శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ డాక్టర్ వి.చెంగల్వరాయలు, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ ప్రసాద్ సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

పార్టీ సహకారం లేకుండా

చైర్మన్ అయ్యే సత్తా ఉందా : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

పార్టీ సహకారం లేకుండా చంద్రకు చైర్మన్ అయ్యే సత్తా ఉందా అని మాజీ ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి తెలిపారు. మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచునూరు చంద్ర రఘురామిరెడ్డి కారణంగానే తాను పార్టీని వీడుతున్నట్లు ప్రకటించడంపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల నుంచి మున్సిపల్ చైర్మన్ పార్టీకి దూరంగా ఉన్నారని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కలవకపోవడం కారణంగా పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొనడం పూర్తిగా అబద్దం అన్నారు. చైర్మన్ హోదాలో జగన్ జిల్లాకు వచ్చిన ప్రతి సందర్భంలో కలిసే అవకాశం ఉందన్నారు. నేరుగా విజయవాడకు వెళ్లి కలవవచ్చునారు. పార్టీ మారాలన్న ఆలోచనతో తోటి కౌన్సిలర్లను కూడా బలవంత పెట్టారని అందులో భాగంగానే కౌన్సిలర్లు తనతో కలిసి మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిశాన్నారు. కోట్లు ఖర్చుపెట్టి చైర్మన్‌గా ఎన్నికయ్యానని చెబుతున్నా చంద్ర వైసిపి పార్టీ గుర్తుపైన గెలిచాను అనే నిజాన్ని మరిచారా అని ప్రశ్నించారు. ఎన్నికలలో గెలుపోటములు సహజమని గెలిచినా, ఓడినా సేవే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమావేశలో వైసిపి నాయకులు లింగన్న,భరత్ కుమార్ రెడ్డి, షరీఫ్, ఎంఆర్ఎఫ్ సుబ్బయ్య, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశకి-చక్రాయపేట



మాట్లాడుతున్న సిఐ ఉలసయ్య

రెండు రోజుల కిందట మండలంలో సురభి గ్రామం కోమటిపేట చంటిని అనే వ్యక్తిని హత్య చేసిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామని ఆర్కే వ్యాలీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉలసయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని వేంపల్లి - రాయచోటి మెయిన్ రోడ్డులో దేవరగుట్టపల్లి గ్రామ సమీపాన పటం మల్లి కార్జున మామిడి తోట వద్ద రెండు రోజుల కిందట హత్య చోటుచేసుకుదన్నారు. హత్య కేసులో నిందితులు దాసరి వెంకటరమణకుమార్, సురభి ఈశ్వరయ్య, జల్జి దర్శనమ్మను ఎస్‌పి ఆదేశాల మేరకు డిఎస్‌పి మురళీ నాయక్ పర్యవేక్షణంలో అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామని చెప్పారు.

డెంగీ నివారణకు కృషి : డిఎంహెచ్‌ఒ



కడప ర్యాలీలో పాల్గొన్న డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. నాగరాజు పేర్కొన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మోచంపేట, రవీంద్రనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఎఎన్ఎం లు, ఆశా కార్యకర్తలతో డెంగీ వ్యాధి నివారణ చర్యలు గురించి ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. దోమల నివారణ, డెంగీ రాకుండా తీసుకోవాల్సిన చర్యలు గురించి ఆరోగ్యశాఖ, మున్సిపల్ శాఖ, పంచాయతీరాజ్ శాఖ సంయుక్తంగా తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. సమావేశం అనంతరం నగరంలో ర్యాలీ నిర్వహించారు. బ్యానర్లు, ప్లకార్డులు, పోస్టర్లు ద్వారా ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మనోరమ, కడప మున్సిపల్ కార్పొరేషన్ ఆదనపు కమిషనర్ రాకేష్ చంద్ర, కడప డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ విజయభాస్కర్, కమ్యూనిటీ మెడిసిన్ డాక్టర్ సయ్యద్ బాషా, ఎపిడి మాలజిస్ట్ ఎస్. ఖాజా మొయిద్దీన్, డెమో భారతి, రవీంద్ర నగర్ యుపిహెచ్ సి మెడికల్ ఆఫీసర్ అనిత శ్రీ, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ జి.వెంకట్‌రెడ్డి, శానిటరి సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. **గోపవరం :** బద్వేల్ పట్టణంలోని ఎన్‌జిఒ హంలో డాక్టర్ వినయ్‌కముఆర్, సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో డెంగీ నివారణకు తీసుకో వాల్సిన చర్యలు వివరించారు. ఈ సందర్భంగా వారుమ మాట్లాడుతూ దోమల ద్వారా సంక్రమించే డెంగీకి వ్యతిరేకంగా నివారణ చర్యలను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం మే 16 న జాతీయ డెంగీ దినోత్సవాన్ని దేశమంతా నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచు కోవాలన్నారు. ప్రతి శుక్రవారమూ ఫ్రైడే డ్రైడే పాటిం చాలన్నారు. అనంతరం ఎన్‌జిఒ హోం నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్, తొట్టిగారిపల్లి, డాక్టర్.శరచంద్ర, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సౌమ్య డాక్టర్ మహేశ్వర్ రెడ్డి ,బి వెంగయ్య, వి. శివరాం రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సురేంద్ర నగర్, కోటవీధి, గాంధీనగర్ ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **ముద్దనూరు :** పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని పిహెచ్ సి వైద్యాధికారులు శ్రీకాంత్, నాగార్జున తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం శ్రీకాంత్, నాగార్జున ఆధ్వర్యంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవ కార్యక్రమంపై ఆశా కార్యకర్తలు, సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ యాదవ్,ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, సూపర్ వైజర్ రామారావు, స్టాఫ్ నర్స్ రమాదేవి, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, సిబ్బంది ఇందిరమ్మ, అపర్ణ, ఆశా కార్యకర్తలు సంధ్య నీలవేణి, విజయ, భారతి పాల్గొన్నారు. **వేంపల్లె :** డెంగీ నివారణకు ప్రతి ఒక్కరిలో అవగాహన ఉండాలని ప్రభుత్వ వైద్యులులక్ష్మి ప్రియా పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమ కాటు వల్ల డెంగీ ప్రబలుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యూకేటర్ షఫివున్నిషా, సిహెచ్ఒవెంకటరత్నం, సూపర్ వైజర్ ఫకృద్దీన్, వెంకటలక్ష్మి, అరుణాదేవి, అంకయ్య, ఎఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు టౌన్ :** జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ ఆరోగ్య కేంద్రాలైన దేవాంగపేట, శ్రీరాములపేట, లైట్ పాలెం సెంటర్ల సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ అలీం దౌల, డాక్టర్ భరత్, డాక్టర్ మౌనిక, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, హెచ్ఇఒ సుబ్బారా యుడు, సిబ్బంది పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టరు రాఘవేంద్ర, డాక్టరు సునీత డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా ఉప మండల అభివృద్ధి అధికారి (ఇఒపిఆర్‌డి) టి. వెంకట సుబ్బారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో సమాజ ఆరోగ్య అధికారి సుకుమారన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి మురళీధర్ పాల్గొన్నారు.



బద్వేల్ పట్టణంలో..



ప్రొద్దుటూరులో..



చింతకొమ్మదిన్నెలో..

రూ.20 లక్షలతో రోడ్డు పనులు

ప్రజాశక్తి - చాపాడు



ఆనందాశ్రమం వద్ద ఏర్పాటు చేసిన తారు రోడ్డు

మండల పరిధిలోని మోరాయపల్లి - ఆనందాశ్రమం ఆర్అండ్‌బి రోడ్డుకు రూ. 20 లక్షలతో మరమ్మతు పనులు చేపట్టారు. 850 మీటర్లు రోడ్డును నూతనంగా ఏర్పాటు చేశారు. 2022లో ఆనందాశ్రమం నుంచి మోరాయపల్లె వరకు రూ. 2.30 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కొంతమేర రోడ్డు దెబ్బ తినలేదని గుర్తించి అప్పట్లో పనులు చేపట్టలేదు. ఆ తరువాత 850 మీటర్లు రోడ్డు దెబ్బ తినడంతో ఆ ప్రాంతాలను గుర్తించి రూ. 20 లక్షలతో మరమ్మతు పనులు చేపట్టారు. ప్రస్తుతం ఆర్అండ్‌బి ఎఇ రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో శ్రీ వెంకటేశ్వర కన్స్ట్రక్షన్స్ వారు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. దెబ్బతిన్న ప్రాంతాలలో రోడ్డును పూర్తిగా తొలగించి తారు రోడ్డు వేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గాన ఆనందాశ్రమం, వడియరాజుపేట, శ్రీరామ్ నగర్,సోమాపురం, సిద్ధారెడ్డి పల్లి, నాగయపల్లి, మోరాయపల్లి గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టి నూతనంగా ఏర్పాటు చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పండ్ల తోటల పెంపకంలో రైతులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం కింద పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి శివ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం లోమడ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకంపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ఉన్నత ఆశయంతో 25 రకాల పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహం అందజేస్తుందన్నారు. కావున రైతులు అవకాశానికి సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. చెర్లోపల్లిలో ఉంసిడిఒ కృష్ణమూర్తి, ఎపిఒ జయభారతి గ్రామ సభలు నిర్వహించి పండ్ల తోటల పెంపకం చేపట్టాలని సూచించారు.

ఖాజీపేట: రైతులు పండ్ల తోటల సాగు వైపు దృష్టి సారించాలని, తద్వారా అధిక ఆదాయం పొందవచ్చు అని మండల అభివృద్ధి అధికారి వెంకటరమణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని భూమాయపల్లెలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి ఎపిఒ చంద్రశేఖర్, సచివాలయ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందని సమీపంలోని సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు కానీ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కానీ రైతులు సంప్రదించి మొక్కలు పొందవచ్చన్నారు. దాదాపు 22 రకాల పండ్ల మొక్కలను రైతులకు ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయ అధికారి నాగరాజ, సచివాలయ సిబ్బంది రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.



ఖాజీపేట : మాట్లాడుతున్న వ్యవసాయాధికారి వెంకటరమణ

ప్రమాద బీమా.. ఉపాధి కూలీలకు ధీమా



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - ఖాజీపేట

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కార్మికులకు (కూలీలు) ప్రభుత్వం ప్రమాద బీమా సదుపాయం కల్పించింది. ఉపాధి పనికి వెళ్లి అనుకోని ప్రమాదానికి గురైతే బీమా పరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం జీవనజ్యోతి, జీవన సురక్ష పథకాలను తప్పనిసరిగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉపాధి హామీ చట్టంలోని కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది. జీవనజ్యోతి బీమా యోజన పథకంలో 18 సంవత్సరాల నుంచి 49 సంవత్సరాల వరకు వర్తించనుంది. ఇందుకు సంబంధించి ఏడాదికి రూ. 436 చెల్లించాల్సింది. ఈ ప్రమాద బీమా సహజ, ప్రమాద మరణాలకు వర్తిస్తుంది. ఏ కారణం చేతనైనా కూలీ మృతి చెందితే రూ. 2 లక్షల నామినికి అందజేస్తారు. 18 నుంచి 70 ఏళ్ల వయసు వారికి సురక్ష బీమా యోజన కింద ఏడాదికి రూ. 20 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రమాద కారణంగా మరణం సంభవించినా , 90 శాతం వైకల్యం బారిన పడిన రూ. 2 లక్షల మొత్తం ఆ కుటుంబ నామినీకి వర్తించనంది. ఈ పథకాలు బ్యాంకులు తపాలా కేంద్రాల ద్వారా పొందవచ్చు. ప్రతి ఏటా జూన్ మొదటి నుంచి మే నెల ఆఖరి వరకు వర్తిస్తాయి. అనంతరం వారి ఖాతా ద్వారా నగదు జమ అయ్యి రెన్యువల్ అవుతాయి. ఉపాధి కార్మికులు రూ. 456 రూపాయలు చెల్లిస్తే రూ. నాలుగు లక్షల వరకు ప్రమాద బీమా సదుపాయం ఉంటుంది. మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉపాధి కార్మికులు ఉపాధి హామీ పథకం ద్వారా పనులకు వెళ్లి ప్రయోజనం పొందుతున్నారు. మండల వ్యాప్తంగా 21 గ్రామపంచాయతీలలో దాదాపు 30 వేల వరకు ఉపాధి శ్రామికులు పథక ప్రయోజనాన్ని పొందునున్నారు.

విత్తన పసుపు నిల్వకు చర్యలు



చెట్ల కింద నిల్వ ఉంచిన పసుపు కొమ్ములు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని రైతులు పసుపు విత్తన నిల్వకు చర్యలు చేపడుతున్నారు. మండల వ్యాప్తంగా సాగుచేసిన పసుపును రైతులు నూర్పిడి చేశారు. అధిక భాగం రైతులు పసుపును ఉడికించి వట్టి పసుపుగా మార్చి అమ్మకాలు చేపడుతున్నారు. ప్రస్తుతం పసుపు ధర రూ.5వేలు పలుకుతుంది. వచ్చే ఏడాది పసుపు సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న రైతులు విత్తన పసుపును సేకరించి నిల్వ ఉంచుతున్నారు. చల్లని ప్రదేశాలు చెట్ల కింద పసుపు ఉంచి మండే కడుతున్నారు. వట్టి పసుపు సిద్ధం చేసిన రైతులు కొంతమంది అమ్మకాలు చేపడుతూ ఉండగా మరికొంతమంది నిల్వ ఉంచుతున్నారు. నాగుల పల్లి వద్ద గల ఎపి గోడౌన్‌లో వట్టి పసుపును నిల్వ ఉంచుతున్నారు. మహారాష్ట్ర సాంగ్లీ మార్కెట్‌కు ఒట్టి పసుపు ను అమ్మకానికి తరలిస్తున్నారు. క్వింటా రూ. 10వేలు ధర పలుకు తుంది. కొంత మంది రైతులు గిట్టుబాటు ధర వస్తుందని అమ్మకాలు చేయకుండా ఎదురు చూస్తున్నారు. అల్లాడుపల్లి, చాపాడు, సీతారా మపురం, లక్ష్మీ పేట, చిన్న గురువలూరు, సిద్ధారెడ్డి పల్లి గ్రామాల వద్ద నిల్వ ఉంచుతున్నారు.

పోలీసుస్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-చిన్నమండెం : స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రిసెప్షన్ కేంద్రంలో రికార్డుల నిర్వహణ, ప్రజా సమస్యలు పరిష్కారాలను తదితర అంశాలను పరిశీలించి మహిళల సమస్యలకు ప్రాధాన్యత, ఇస్తూ పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసుల సీడీ ఫైళ్లను పరిశీలించి, వాటి దర్యాప్తు, పురోగతిపై ఆరా తీశారు. రౌడీ షీటర్లు, చెడునడవడిక కలిగిన వ్యక్తులపై, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టేందుకు రాత్రి గస్తీ విధులను మరింత పటిష్టంగా నిర్వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎన్‌బిడబ్ల్యును త్వరగా అమలుపరచాలన్నారు. గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు అవగాహన కల్పించాలన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఒ శ్రీలత

పౌష్టికాహారం తీసుకోవాలి : సిడిపిఒ

ప్రజాశక్తి- సింహాద్రిపురం

పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత బారిన పడకుండా ఉండవచ్చని పులివెందుల ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ శ్రీలత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అగ్రహారం, అంకాలమ్మ గూడూరులలో కిశోర వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిడిపిఒ మాట్లాడుతూ ఎక్కువమంది కౌమార దశ బాలికలు బయట చేసే వంటలను తింటున్నారని, దీని వల్ల ఎన్నో అనర్ధాలకు దారి తీసే ప్రమాదముందని చెప్పారు. ఇంట్లో అమ్మ చేసే చేతి వంటలు తినాలని సూచించారు. ముఖ్యంగా ఈ దశలో ఉన్నవారు మంచి పౌష్టికాహారం తీసుకోవడం తప్పనిసరి అన్నారు. మొబైల్ ఎక్కువగా చూడటం వల్ల అనారోగ్యాలు వస్తాయని చెప్పారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై బాలికలకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ వసంతకుమారి, అంగన్వాడి కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి - సింహాద్రిపురం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తూ ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి పొందిన శ్రీనివాస్‌రెడ్డిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కృష్ణమూర్తి మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ శ్రీనివాస్ రెడ్డి అందరి మన్ననలను పొందారన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరి సహకారంతో మండలం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి వెంకట రాముడు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన డిసిసిబి చైర్మన్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిని కడప సహకార బ్యాంకు చైర్మన్‌గా ఇటీవల నియమితులైన బి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీని సన్మానించారు. త్వరలో సహకార బ్యాంకు చైర్మన్‌గా ప్రభాస్ స్వీకారం చేయబోతున్నానని కార్యక్రమానికి తప్పకుండా రావాలని కోరారు. రాంగోపాల్ రెడ్డి డిసిసి చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న డిసిసిబి చైర్మన్